క్లుప్తంగా

నేడు ఠాగూర్ గ్రంథాలయంలో అదనపు హాలు ప్రారంభం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో రూ.56 లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు హాలు ప్రారంభోత్సవం గురువారం ఉదయం 8.30 గంటలకు జరుగుతుందని గ్రంథాలయాధికారి కె.రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు.

చెరువులుగా మారిన ఖాళీ స్థలాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మిచాంగ్ తుపాను నేపథ్యంలో నగరంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. గద్దే వెంకట్రామయ్యనగర్ దావు బుచ్చయ్యకాలనీ తదితర ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు చెరువులను తలపిస్తున్నాయి.

విరిగిపడిన చెట్ల తొలగింపు



మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని 30వ డివిజన్ రామకృష్ణాపురం, దేవీనగర్‌లో బుధవారం కార్పొరేటర్ బి.జానారెడ్డి పర్యవేక్షణలో విరిగిపడిన చెట్లను తొలగించారు. మంగళవారం రాత్రి ఈదురుగాలులు, వర్షాలకు పలు చెట్లు కూలిపోయాయి. దీంతో అధికారులతో మాట్లాడి చెట్ల కొమ్మలు తొలగింప చేశారు. బుడమేరులో పెరిగిన వరద నీరు ఇళ్లలోకి చేరుకోవటంతో అధికారులతో మాట్లాడి బుడమేరు నీటిని ఏలూరు కాలువలోకి తరలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దుర్గారావు, కృష్ణ తదితరులు స్వచ్ఛందంగా పాల్గొని సిబ్బందికి సహకరించారు.

మధురంగా సాగిన వీణా వాద్య కచేరి



విజయవాడకల్చరల్: గాయక సార్వభౌమ సంగీత పరిషత్, స్వరఝరి ఆధ్వర్యంలో సంగీత విద్వాంసుడు పారుపల్లి రామకృష్ణయ్య పంతులు 140 వ జయంతి సందర్భంగా గాంధీనగర్‌లోని చిట్టూరి కళావేదికపై నిర్వహిస్తున్న సంగీత మహోత్సవాలు రెండవ రోజుకు చేరుకున్నాయి. బుధవారం నాటి కార్యక్రమంలో యువ సంగీత కళాకారుడు చిట్టా కార్తీక్ త్యాగరాజ స్వామి, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి, అన్నమయ్య కీర్తనలను మధురంగా వీణపై పలికించారు. నగుమోము కనలేని, బ్రోచేవారెవరురా, రఘువంశ సుధాంబుధి చంద్ర, నారాయణతే నమో నమో, థిల్లానా తదితర కీర్తనలు చోటు చేసుకున్నాయి. పారుపల్లి సుబ్బరాయ ఫల్గుణ్ మృదంగంపై, హరిబాబు ఘటంపై సహకరించారు. గురువారం నాటి కార్యక్రమంలో ఆకాశవాణి విశ్రాంత టాప్ గ్రేడ్ ఆర్టిస్ట్ మోదుమూడి సుధాకర్ కల్యాణి ఏకరాగ సభ నిర్వహిస్తున్నట్లు సంస్థ సభ్యురాలు అంజనా సుధాకర్ తెలిపారు.

అయ్యప్పస్వామికి అభిషేకాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం శ్రీ అయ్యప్పస్వామివారి మందిరంలో బుధవారం కార్తిక మాసోత్సవాలలో భాగంగా స్వామివారికి విశేషంగా అభిషేకం, అర్చనలు జరిగాయి. గురుస్వామి బల్లెం పూర్ణయ్య స్వామివారికి ప్రీతికరమైన అభిషేకాలు, అర్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

నేటి నుంచి జిల్లాలో 144 సెక్షన్ నిషేధాజ్ఞలు అమలు

విజయవాడ స్పోర్ట్స్: ప్రజా శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రాంతాల్లో ఈ నెల ఏడో తేదీ నుంచి 144 సీఆర్‌పీసీ కింద నిషేధాజ్ఞలను అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ టి.కె.రాణా బుధవారం తెలిపారు. 2024 జనవరి 25వ తేదీ వరకు 50 రోజుల పాటు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. నిషేధాజ్ఞలు అమలులో ఉన్న సమయంలో పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఇబ్రహీంపట్నం, భవానీపురం, వన్‌టౌన్, టూ టౌన్, సత్యనారాయణపురం, అజిత్‌సింగ్‌నగర్, నున్న, గవర్నర్‌పేట, సూర్యారావుపేట, కృష్ణలంక, మాచవరం, గుణదల, పటమట పోలీస్ స్టేషన్ ప్రాంతాల్లో ఈ నిబంధనలు అమలులో ఉంటాయని సీపీ టీకే రాణా తెలిపారు.

జగన్ నేతృత్వంలో రాజ్యాంగబద్ధ పాలన

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలంపల్లి



ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాజ్యాంగ బద్ధంగా పాలన సాగిస్తోందని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. భవానీపురంలోని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం రాజ్యాంగ నిర్మాత డాక్టర బీఆర్ అంబేద్కర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ బీఆర్ అంబేద్కర్ ప్రపంచ మేధావి అని కొనియాడారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు పోలిమెట్ల శరత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, దుర్గ గుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, కార్పొరేటర్లు ఇర్ఫాన్, ఆంజనేయ రెడ్డి, కోటిరెడ్డి, చైతన్య రెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు బుదాల శ్రీనివాసరావు, కామళ్ళ జోజి, నన్నెం దుర్గ, సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ తనుబుద్ధి చంద్రశేఖరరెడ్డి, జోసఫ్, పి.రమేష్, బి.అప్పారావు, వరకాని థామస్, నరసింహారావు, కె.సాయికుమార్, కోటేశ్వర రావు, గాలి గురవయ్య, పి.శేఖర్, లాజర్, కమలాకర్, ఆనంద్ రావు, లేళ్లపూడి లాజర్, గడ్డం సాంబ తదితరులు పాల్గొన్నారు.

బడుగుల అభ్యున్నతికి కృషి చేసిన అంబేద్కర్

లబ్బీపేట(విజయవాడతూర్పు): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసిన మహనీయులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత కొనియాడారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం గిరిపురం మూడు బొమ్మల సెంటర్‌లోని ఆయన విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుక్కల అనిత మాట్లాడుతూ దేశానికి పటిష్టమైన రాజ్యాంగాన్ని అందించడమే కాకుండా, సమాజంలో అసమానతలు రూపుమాపేందుకు అందరికీ సమాన హక్కుల కల్పించిన మేధావి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అన్నారు. ఆయనను స్మరించుకోవడంతో పాటు, అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు మరియరాణి, నాగభూషణం, మత్తేరాణి, మణి, కొమ్ము చంటి, కుక్కల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దార్శనికుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్

విజయవాడ కల్చరల్: దార్శనికుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్‌రాజు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో బుధవారం డాక్టర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. డేవిడ్‌రాజు మాట్లాడుతూ అంబేద్కర్ స్ఫూర్తితో నేడు ఎందరో యువతీ యువకులు ఉన్నత చదువులు అభ్యసిస్తున్నారని తెలిపారు. సంస్థ కోశాధికారి బీవీ వీరభద్రరావు మాట్లాడుతూ అంబేద్కర్ కన్న కలలను సాకారం చేయాల్సిన అవసరముందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా విజయవాడ నడిబొడ్డున స్వరాజ్య మైదానంలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని నిర్మిస్తోందన్నారు. కార్యక్రమంలో వివిధ సాహిత్య సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, అశోక్ ఆనంద్, చావా నరసింహారావు, కారుమంచి రాజు, డి.చంద్రశేఖర్, దాసరి వెంకటరమణ, జిలానీఖాన్ పాల్గొన్నారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ అంబేద్కర్

పాయకాపురం(విజయవాడరూరల్): భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన అలుపెరగని కృషి చేశారని 62వ డివిజన్ కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి అన్నారు. అంబేద్కర్‌ బుధవారం ఎల్‌బీస్ నగర్ మూడు బొమ్మల సెంటర్లో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం అంబేద్కర్ విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వీరబాబు, అలంపూరు విజయ్, మస్తాన్, బుజ్జి, సాంబయ్య, బ్రహ్మేంద్ర, యోహోను, హైమావతి, రెడ్డెమ్మ, సుభాన్, కుసుమ, భవాని తదితరులు పాల్గొన్నారు.

తుపాను బాధితులకు ఎమ్మెల్యే సహాయం

మిచాంగ్ తుపాను బాధితులు 400 మందికి బుధవారం ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అల్పాహారం పంపారు. 62వ డివిజన్ వైఎస్సార్ సీపీ నాయకులు వాటిని బాధితులకు అందజేశారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి

మధురానగర్(విజయవాడసెంట్రల్): దేశంలో అంటరానితనం, అస్పృశ్యత రూపుమాపటానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కీలక పాత్ర పోషించారని ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి కొనియాడారు. స్థానిక సత్యనారాయణపురం వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కార్యాలయంలో బుధవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సముచిత స్థానం కల్పించారన్నారు. విజయవాడ నగరం నడిబొడ్డున నూట ఇరవై ఐదు అడుగుల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహం, స్మృతి వనం ఏర్పాటు చేయటం ద్వారా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు ఇస్తున్న ప్రాధాన్యత తెలియజేస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 61 వ డివిజన్ అధ్యక్షుడు బల్లం కిషోర్, నాయకులు కమ్మిలి రత్నకుమార్, సూరిబాబు, జి.దత్తు, షేక్ మెహరాజ్, గోవింద్, గొర్రెల దుర్గాప్రసాద్, ఓ.దుర్గారావు, చింతలపూడి రమేష్, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



వైఎస్సార్ టీయూ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గౌతంరెడ్డి



అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు

బావాజీపేటలో...

27వ డివిజన్ బావాజీపేటలో బీఆర్‌టీఎస్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన బుధవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జి.ఏడు కొండలు, కొండాయగుంట రాము, డాక్టర్ బ్రహ్మదేశం వసంత కుమార్, బీసీ నాయకుడు వీరంకి గోకర్ణేశ్వరరావు, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పోతుల విల్సన్ రాజు, రాజారావు, దుర్గారావు, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలు నెరవేరుస్తున్న సీఎం జగన్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): బడుగు, బలహీన వర్గాల ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలను అందించాలనేదే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవిత లక్ష్యమని, ఆ మహనీయుడి ఆశయాలను ఆచరణలో నెరవేర్చి చూపుతున్న ఏకైక ముఖ్యమంత్రి మన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి బుధవారం సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగింది. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, చింతా శ్రీను, షేక్ అమిత్, గెల్లిపోగు రాజు తదితరులు పాల్గొన్నారు.

- **సింగ్‌నగర్ లూనా టర్‌లో...**

స్థానిక 59వ డివిజన్ సింగ్‌నగర్ లూనా సెంటర్‌లో విగ్రహ కమిటీ పెద్దల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదిరాల విజయ్‌కుమార్, కంబగళ్ల రాజు, సురేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

- **58వ డివిజన్‌లో...**

స్థానిక 58వ డివిజన్ సింగ్‌నగర్ కరెంట్ ఆఫీస్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి జరిగింది. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ ముఖ్యఅతిథిగా పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, ఎం.అశోక్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

- **60వ డివిజన్‌లో...**

వాంబేకాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి జరిగింది. కమిటీ పెద్దలు కె.రామరాజు, కంచి ధనశేఖర్ పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు రమేష్, చప్పిడి కాశీ, సూరి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం కోసం పోరాడిన అంబేద్కర్

పాయకాపురం(విజయవాడరూరల్): నగరంలోని 61వ డివిజన్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోట శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షుడు బల్లం కిషోర్, నాయకులు కోలా పవన్‌కుమార్, కైకాల శరన్, ఎస్.సుబ్బారెడ్డి, ఓంకార్, దాసు, దానం దుర్గారావు, సీపీ రెడ్డి, ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



బావాజీపేటలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న దేవిడ్‌రాజు, వీరభద్రరావు, చిట్టిబాబు తదితరులు



గిరిపురంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ కుక్కల అనిత



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న డెప్యూటీ మేయర్ శ్రీశైలజ, వైఎస్సార్‌సీపీ నాయకులు



లూనాసెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, దళిత సంఘ పెద్దలు

మహానటి నటజీవితం భావి నటులకు ఆదర్శం

ఘనంగా సినీ నటి సావిత్రి జయంతి వేడుకలు

విజయవాడ కల్చరల్: మహానటి నటజీవితం భావి నటీమణులకు ఆదర్శమని కళాపీఠం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి అన్నారు. మహానటి సావిత్రి సంక్షేమ, సాంస్కృతిక సేవా సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం సినీ నటి, నిర్మాత, దర్శకురాలు సావిత్రి 88 వ జయంతి వేడుకలు, సావిత్రి స్మారక పురస్కారాలు, సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ సావిత్రి గొప్పనటి అని, అంతకుమించి గొప్ప మానవతా మూర్తిగా అభివర్ణించారు. ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణ మాట్లాడుతూ ఆమె నడిచే నట గ్రంథాలయమని ఏ పాత్రనైనా అవలీలగా పోషించగలరన్నారు. కార్యక్రమంలో ప్రభల శ్రీనివాస్, బీవీ వీరభద్రరావు, చింతకాయల చిట్టిబాబు, ఉమా బలరాం సావిత్రి నటజీవిత విశేషాలను వివరించారు. 2023వ సంవత్సరానికి గానూ పల్లెకొండ శ్రీనివాస్, చావా నరసింహారావులకు మహానటి సావిత్రి అవార్డులను అందజేశారు. గాయనీ గాయకులు సుధారాణి, విష్ణుప్రియ, రసూల్‌బాబు, కొమ్మినేని రత్నకుమారి సావిత్రి నటించిన చిత్రగీతాలను ఆలపించారు.



పల్లెకొండ శ్రీనివాస్, చావా నరసింహారావులను సత్కరిస్తున్న విజయలక్ష్మి, ఉమాబలరాం తదితరులు

రాష్ట్ర ప్రయోజనాలే సీఎం జగన్‌కు ప్రధానం

- రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు
- 58వ డివిజన్ 240వ వార్డు సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ముఖ్యమని, రాష్ట్ర ప్రజల అభ్యున్నతి కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిరంతరాయంగా కృషి చేస్తుందని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 58వ డివిజన్ 240వ వార్డు సచివాలయ పరిధిలో బుధవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి ఆయన నందమూరి నగర్‌లో పర్యటించి 212 గడపలను సందర్శించారు. టీడీపీ పాలనలో కాళ్లరిగేలా తిరిగినా ఏ పనీ జరిగేది కాదని, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రజలకు అన్ని రకాల సదుపాయాలు ఇంటి వద్దనే అందుతున్నాయన్నారు.

తుపానును కూడా నీచ రాజకీయాలకు వాడడం సిగ్గుచేటు

తుపానుపై కూడా ప్రతిపక్ష నాయకులు కుట్ర రాజకీయాలు చేయడం సిగ్గుచేటని ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆగ్రహం వ్యక్తంచేశారు. హుదూద్, తిత్లీ తుపాన్ల సమయంలో బాధితులకు ఏ మాత్రం పరిహారం ఇచ్చారో చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ సమయంలో కనీసం నిత్యావసరాలు కూడా అందించలేదని, పైగా కేంద్రం నుంచి వచ్చిన రూ.1000 కోట్ల నిధులలో కేవలం రూ.300 కోట్లు మాత్రమే ఖర్చు చేసి మిగిలిన నిధులు పక్కదారి పట్టించింది నిజమా కాదా అని ప్రశ్నించారు. బాధితులకు సాయం ఎలా ఎగ్గొట్టాలన్నది చంద్రబాబు సిద్ధాంతమైతే, ఎలా ఇవ్వాలన్నదే జగనన్న లక్ష్యమని అన్నారు. మరోవైపు రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల ఓట్లను తొలగించేందుకు ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలను ఇప్పటికే ఎలక్షన్ కమిషన్ దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు.

చంద్రబాబు, లోకేశ్ తమ ఎల్లో మీడియాను అడ్డంపెట్టుకొని ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా 2024 ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను ఢీకొనలేరని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, అఫ్రోజ్, తోపుల వరలక్ష్మి, శోభన్, నేరెళ్ల శివ, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే విష్ణు

3 వేల మంది నర్సింగ్ విద్యార్థినులకు సీపీఆర్ శిక్షణ

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలోని అన్ని వైద్య కళాశాలల్లో ఉన్న మూడు వేల మంది నర్సింగ్ విద్యార్థినులకు కార్డియో పల్మనరీ రీససిటేషన్ (సీపీఆర్) శిక్షణ ఇచ్చినట్లు మత్తు వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ యు తారక్‌ప్రసాద్ తెలిపారు. ఐఆర్‌సీఎఫ్ చైర్మన్ డాక్టర్ ఎస్ఎస్‌సీ చక్రరావు ఆదేశాల మేరకు ప్రతి వైద్య కళాశాలలోని ఎనస్థీషియా ప్రొఫెసర్ నర్సింగ్ విద్యార్థులకు సీపీఆర్ విధానాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణలో పాల్గొన్న విద్యార్థినిలందరికీ నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జిమినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) సర్టిఫికెట్ అందచేసినట్లు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరం అన్నారు. అత్యవసర సమయంలో సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాలు కాపాడవచ్చునని ఆయన తెలిపారు.

అత్యవసర ప్రథమ చికిత్సపై అవగాహన...

ప్రాణాపాయంలో అందించాల్సిన అత్యవసర ప్రథమ చికిత్సా విధానాలపై బుధవారం ఫార్మసీ విద్యార్థులకు అవగాహన కలిగించారు. చిన ఆవుటుపల్లిలోని పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాలకు చెందిన డాక్టర్ కళ్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొని కార్డియో పల్మనరీ రీ ససిటేషన్ విధానాలపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచంట సునీత, కార్యక్రమ సమన్వయకర్త గంటా విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో టీటీడీ చైర్మన్ భూమన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): టీటీడీ పాలక మండలి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి బుధవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భూమనను ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో కెఎస్.రామారావు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం భూమనకు వేద పండితులు ఆశీర్వచనం అందచేయగా, ఆలయ చైర్మన్ , ఈవోలు అమ్మవారి ప్రసాదాలు, చిత్రపటాన్ని, పట్టు వస్త్రాలను అందజేశారు.



భూమన కరుణాకర్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న చైర్మన్ రాంబాబు, ఈవో రామారావు

వికసిత్ భారత్ ఏర్పాట్ల పరిశీలన

భవానీపురం(విజయవాడపశ్చిమ): వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గురువారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరుగనుంది. కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ హాజరు కానున్నారు. ఈ క్రమంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు బుధవారం సాయంత్రం కళాక్షేత్రంలో ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమ వేదిక, పారిశుద్ధ్యం, వైద్య శిబిరాలు, అగ్నిమాపక, తాగు నీరు, పార్కింగ్ తదితర ఏర్పాట్లకు సంబంధించి అధికారులకు సూచనలు చేశారు.

కొట్లాట కేసులో నిందితుడికి జైలు

విజయవాడస్పోర్ట్స్: న్యూ ఆర్‌ఆర్‌పేటలోని ఓ టీ స్టాల్ వద్ద గత ఏడాది నవంబర్ 24వ తేదీన జరిగిన కొట్లాట కేసులో నిందితుడు గోనా కిషోర్‌కు నాలుగు నెలల జైలు శిక్ష విధిస్తూ విజయవాడ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి సి.రమణారెడ్డి బుధవారం తీర్పు చెప్పారు. టీ స్టాల్ వద్ద టీ తాగుతున్న ఓ వ్యక్తిని డబ్బులు ఇవ్వమని నిందితుడు కిషోర్ బెదిరించాడు. డబ్బులు లేవని చెప్పడంతో నిందితుడు కిషోర్ తనపై పదునైన ఆయుధంతో దాడి చేసినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రాసిక్యూషన్ తరుపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.కృష్ణకిషోర్ కోర్టుకు వాదనలు వినిపించారు. ఐదుగురు సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు కిషోర్‌కు జైలు శిక్ష విధించారు.

అంబేద్కర్‌కు స్వర నీరాజనం



విజయవాడ కల్చరల్: శ్రీ మురుగా చారిటబుల్ సంస్థ ఆధ్వర్యంలో సినీ నటి సావిత్రి జయంతి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై బుధవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. రమాశంకర్ ఆధ్వర్యంలో గాయనీ గాయకులు శ్యాంప్రసాద్, రైల్వే శ్రీనివాస్, ఆదిరాల జయప్రభ, కృష్ణకుమారి, డి.చంద్రశేఖర్ తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. కాపు సంఘం నాయకులు మాంతి రమణ, చంద్రమోహన్, సింధు, ఝాన్సీ, శ్రీనివాస్‌లను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో డేవిడ్‌రాజు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.